# 27. కాలింగ్ బెల్

"**అందరూ** కూర్చోండి!" అన్నాను; అందరి నమస్కారాలకీ ఒకేసారి ప్రతినమస్కారం చేసి.

మొత్తం పదహారుమంది.

చిన్న గుమస్తాలు, సీనియర్ గుమాస్తాలు, హెడ్గుమస్తా, ఔట్‌డోరు ఇనస్పెక్టర్లు, టైపిస్టులు: రకరకాల వాళ్ళున్నారు, ఆశెక్షన్లో.

నా సంస్థలో రాబడిశాఖ ఆశెక్షను. సంవత్సరానికి పదహారు లక్షల ఆదాయం వాళ్ళ ఫైళ్లలో వుంటుంది. తేదీలవారీగా, గంటలవారీగా ఏయే పార్టీలనుంచి ఎంతెంత సొమ్ము రావాలో ఫైళ్ళలో లెడ్జర్లలో జాగ్రత్తగా రాస్తారు వాళ్ళు. వసూలుకాని మొద్దు బాకీలమీద దాడులు, సంప్రదింపులు, జరుపుతారు. ఇంకా వసూలవకపోతే దావాలు తేవడానికి కాగితాలు సిద్ధం చేస్తారు.

అంతా చురుకైన వాళ్ళుగా సమర్థులుగా సంస్థపట్ల స్వామిభక్తి ప్రదర్శకులుగా, నేనీ సంస్థకు మేనేజింగు డైరక్టరుగా పనిచేస్తున్న ఈ ఐదేళ్ళుగా నాకు తెలుస్తోంది.

అర్జంటుగా ఏదైనా ఆర్డర్ నానుంచి కావాలంటే చొరవగా, వినయంగా, నాగదికి వచ్చి ఫైలుచేత్తో పట్టుకొచ్చీ కూడా నిమిషాలమీద సంగతంతా బోధపరిచి నా అనుజ్ఞ నోటి మాటగా రాత మూలకంగా తీసుకుంటారు, వాళ్ళలో ప్రతివాక్కరూనూ. పావుగంటలో ఫైలు మీద ఆ సంగతంతా వివరించి; వాళ్ళకీ నాకూ మధ్యన వున్న సూపరింటెండెంటు, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల సంతకాలు చేయించుకుని ఫైలు పంపి ఆర్డర్ తీసుకుంటారు.

హఠాత్తుగా వాళ్ళ శెక్షనుకి నా అంత పెద్ద ఆఫీసరు వెళ్ళిపోడం; అందులోనూ సూపరింటెండెంటు; ఎ.ఒ. ఎవర్నీ తీసుకెళ్లకుండా నేనే స్వయంగా వెళ్ళిపోడం వాళ్ళకి కంగారు పుట్టిస్తుందని నాకు తెలుసు.

అందుకనే; నేను కూర్చోండనగానే వాళ్ళలో ఏ ఒక్కరూ కూర్చోలేదు.

నేను హెడ్ గుమస్తా టేబిలుకు ఎదరుగా వున్న ఓ కుర్చీలో కూర్చున్నాను. "మీరంతా దయచేసి కూర్చోండి. నేను మీతో కొంతసేపు గడపాలని వచ్చాను." అని అందర్నీ కూర్చోమని చేతి సంజ్ఞకూడా చేసి చెప్పాను.

హెడ్ గుమస్తా పరమేశ్వర్రావు వెంటనే లేచి నన్ను తన సీట్లోకి రమ్మని అర్థించాడు. టేబిలు మీంచి దృష్టి సారించి చూసేను. నేను అతిథులకోసం వేసిన కుర్చీలో కూర్చున్నాను. అంతకంటె ఆయన కూర్చునే కుర్చీమంచిది. పైగా అందులో ఆరంగుళాల మందం వున్న ఫోమ్ దిండువుంది.

నా ఎదురుగా అతను ఆకాస్త సుఖం అనుభవించడానికి మొహమాటపడుతున్నట్లు; పోనీ, నేనక్కడ వుండబోయే ఆ కాసేపూ ఆ సుఖం నాకు ఆఫర్ చేస్తున్నట్టు నాకు క్షణంలో స్ఫురించింది.

"తమరక్కడ కూర్చుంటే అందరూ తమకి డయిరెక్టుగా కనిపిస్తారు. " అన్నాడు పరమేశ్వర్రావు, నేననుకున్నది కాదని స్ఫురించడానికి. నేను పెట్టబోయే మీటింగుకి అది అవసరమే.

"ఆల్‌రైట్ !" అని లేచి వెళ్ళి అతని సీట్లో కూర్చున్నాను.

పరమేశ్వర్రావు నేనింతవరకు కూర్చున్న కుర్చీని కొంచెం జరిపాడు. అక్కడ అతను కూర్చుంటే నాకు కనిపించని వారెవ్వరూ వుండరు.

"ఎలా వున్నది, పని?" అన్నాను; అందర్నీ వుద్దేశించి తల అర్థ వృత్తాకారంలో తిప్పి.

"బాగానే వుం" దని వాళ్ళ గుడగుడలను బట్టి తెలుసుకున్నాను.

అంతకంటె ఏం చెబుతారు వాళ్ళు! వాళ్ళలో ఏ ఒక్కరు ఏమిమాట్లాడినా దానికి చిలవలు పలవలు అల్లి మరొకరెవరో సూపరింటెండెంటు తోనో ఎ.ఒ.తోనో చెప్పొచ్చునని, వాళ్ళలో వాళ్ళకి భయం వుంటుంది.

"మీరు లేనప్పుడు ఎం.డి.గారు మారూంలో కొస్తే మన గుర్నాథరావు తమరిగురించి ఇలాగన్నాడు సార్. నాకు కష్టంవేసి మీకు ఘనవిచేస్తున్నాను" అని - ఈ విధంగా చాడీలు చెప్పడానికి కొందరు సిద్ధంగావచ్చు. ఇద్దరుముగ్గురు కలిసి ఒకడిమీద, ఒక్కొక్కప్పుడు వాళ్ళలో వాళ్ళే కూడా, ఇలా చెప్పుకోగలరు. అలాంటి వాళ్ళు ప్రతి ఆఫీసులోనూ వుంటారు.

"పనెక్కువగా వుంటోందా?" అన్నాను; ప్రత్యేకంగా పరమేశ్వర్రావును ఉద్దేశించి.

పరమేశ్వరరావు నమ్రతతో నవ్వేడు.

"పనీ -" అని కొంచెం నాన్చి; "పని ఉంటుందనుకోండి సార్. అయితే అంత అలివి మాలిన పనికాదు. అయినా-" అని అందరివేపూ ఓ సారి కలయచూసి" ఏవరేజిమీద ప్రతివాడికీ వారంమొత్తంమీద ఏడెనిమిదిగంటలు అదనంగా చెయ్యవలసిన పని వుంటోంది."

బెల్ మోగింది. అందరూ డిశ్పాచ్ గుమస్తా సుబ్బారావు వేపు చూశారు. అతను లేచాడు.

చప్పుడొచ్చిన వేపు చూశాను. వీళ్ళందరూ కూర్చునే హాలులోనే, ద్వారం మీదుగా ఓ బెల్ అమర్చబడివుంది. అది బజర్ కాదు. కరెంటుతో పనిచేసేదయినా కంచుగంటే. శబ్దం కఠోరంగా వుంది.

సుబ్బారావు హడావిడిగా వెళిపోతున్నాడు.

చిటికవేసి పిలిచాను.

"ఎ.ఒ.గారు పిల్చారుసార్." అన్నాడు పరమేశ్వర్రావు.

"వెళ్ళండి. కాని నేనిక్కడున్నానని ఆయనకి చెప్పకండి. ఆయన పనిమానేసి వొచ్చేస్తారో యేమిటో." అన్నాను

"ఎస్సార్." అని సుబ్బారావు వెళ్ళాడు.

"కె.అండ్.కె. లిమిటెడ్ తో మన తగాదా తారాస్థాయికి వొచ్చేసింది. బహుశా కోర్టు కెళ్ళాల్సివొస్తుందేమో. ఆఫైలు జాగర్తగా మొదట్నించీ చదువుకొని ముఖ్య విషయాలన్నీ వోకాయితంమీద లిస్టురాయండి." అని పరమేశ్వర్రావుకు చెప్పాను.

"అలాగే సార్"

'ఆఫైల్లో ఒరిజినల్ నోటు ఎవర్రాస్తారు? మీరేననుకుంటాను; నారాయణ మూర్తిగారూ ?' అన్నాను.

నారాయణ మూర్తి నిలబడ్డాడు. చేతులు కట్టుకుని "ఎస్సార్" అని తలవూపాడు.

"కూర్చోండి... మీరు ముందుగా రాయండి, వొకలిస్టు. ఆ తరవాత పరమేశ్వర్రావు గారూ, మీరు విడిగా ఫైలు చదివి, ఆయన లిస్టుతో సంబంధం లేకుండా వేరేవొక లిస్టు ప్రిపేరు చెయ్యండి. ఫాలో?" అన్నాను.

"అలాగే సార్"

బెల్ మళ్ళీ మోగింది. ఎవరో ఆపదలో వుండి ఆర్తనాదం చేసినట్టుంది, ఆధ్వని; ఎవర్నో పిల్చినట్టు కాకండా .

పరమేశ్వర్రావు "ఎక్స్‌క్యూజ్మి, సార్!" అని లేచి పరుగులాంటి నడకతో బయలుదేరాడు.

"నేచెప్పింది గుర్తుందిగా?" అని నేనన్నమాట అతను ద్వారం దాటుతూ విని, తల వెనక్కి తిప్పి "ఎస్సార్" అని వెళ్ళాడు.

"సుబ్రమణ్యం! మీరెప్పట్నుంచి శలవులో వెళ్తున్నారు?

"వెళ్ళడం లేదుసార్ ..." అని సుబ్రమణ్యం లేచాడు.

"నేనుగ్రాంట్ చేయలేదా?" కూచోమని సంజ్ఞచేస్తూ అడిగాను.

"తమరు గ్రాంట్ చేశారు సార్..." అని తలవంచుకుని "నేనే విత్‌డ్రా చేసుకున్నాను."

"అనవసరంగా సెలవు పెట్టొద్దని సర్క్యులర్ ఇచ్చాను కదా. దాని ప్రకారం మీరసలు పెట్టేవుండకూడదుగా."

"శలవు అవసరమేనండి. కాని ఆఫీసులో వర్కుందండి. నాసీట్లో రెండు కోర్టు కేసులు నడుస్తున్నాయండి. పదేసి రోజులకో వాయిదా చొప్పున పడుతోంది. రెండింటి మీదా కలిపి. పదిరోజుల్లో వొక్కరోజే కోర్టుకి హాజరు కావలసున్నా మిగిలిన దినాలు దానికి తయారవడానికి చాలడంలేదండి. నేనెళ్ళిపోతే తమకందరికీ శ్రమ యెక్కువని-"

"ఐసీ-" - నేను కళ్ళుమూసుకుని టేబిలుమీద వేళ్ళతో ఏదో వ్యర్థధ్వని చేశాను.

ఇతను శలవులో వెళ్తాననడం, వెళితే తనకి కలిగే యిబ్బందీ ఎ.ఒ. నాతో చెప్పాడు. శలవు గ్రాంటు చేసీ కూడా నేను రిక్వెస్టు చేశానని చెప్పమని ఎ.ఒ.తో చెప్పి శలవు విత్‌డ్రా చేయించడం నాకు గుర్తుంది. ఈ సంఘటనలో ఎక్కడా నాపేరుగాని ఎ.ఒ.పేరుగాని ఎత్తకుండా తన అసమ్మతిని చెప్పగలిగాడు సుబ్రమణ్యం. నాకతనిమీద దయకలిగింది. నామీద గర్వం కూడా కలిగింది.

పరమేశ్వరరావూ సుబ్బారావూ చెరో ఫైలూ పట్టుకుని వచ్చారు. ఎవరిజాగాల్లో వారు కూర్చున్నారు.

బెల్ మోగింది.

ఔట్‌డోర్ ఇన్‌స్పెక్టరు ప్రసాదరావు లేచి వెళ్ళాడు. బెల్ మోత ఎప్పట్లాగే 'రక్షించండి బాబోయ్' అని కేకేసినట్టుంది.

అప్రయత్నంగా ఆ బెల్‌వేపు చూశాను. నేను చూశానని అందరూ అటు చూశారు.

బెల్ మళ్ళీ మోగింది. ఈమాటు సీనియర్ క్లర్క్ గుర్నాథం లేచి వెళ్ళాడు.

" ఈ బెల్ ఎప్పుడు పెట్టారు?" అన్నాను.

"కొత్త ఎ.ఒ. గారు జాయినైన పదిహేను రోజులకి పెట్టారండి" అన్నాడు పరమేశ్వర్రావు.

'బెల్ మోగగానే ఫలానా వార్ని పిల్చేరని తెలిసినట్టు వెళిపోతున్నారే; హౌ ఈజిట్ పాజిబుల్?' అన్నాను.

అందరూ నవ్వేశారు.

ఈమాత్రం తెలీదా? - అని ఆ నవ్వుకర్థం చెప్పుకోవచ్చు. కాని వాళ్ళు అలా నన్ను తేలిక చెయ్యరు.

"దీనికో కథుంది. అదితెలిస్తే అంతా తెలిసినట్టే." అని దానర్థం; నాకు స్ఫురించింది.

పరమేశ్వర్రావు గొంతు సర్దుకున్నాడు.

"బెల్ మోత స్థాయినిబట్టి, పరిమాణాన్నిబట్టి ఎ.ఒ.గారు మాలో ఎవర్ని పిల్చిందీ మాకు గుర్తేనండి."

"అంటే?"

"నేను వారిదగ్గరకు వెళ్ళాలనుకోండి. ట్రింగ్ ట్రింగ్‌మని నాలుగుసార్లు మోగుతుం దండది. డిశ్పాచ్ క్లర్క్‌కయితే ఒకసారి లాంగ్‌గా షార్ప్‌గా మోగుతుందండి. ప్రసాదరావుకి మూడు రింగ్సు; అనంతరావుకి రెండు - ఇలాగ ఎవరి గుర్తు వారికుందండి." అన్నాడు.

టైపిస్టు సురేంద్రనాథ్ ఒక అట్టతెచ్చిచ్చాడు. దానిమీద ఓ కాగితం అంటించివుంది. ఆ కాగితం మీద-

...హెచ్.సి.

... ... ఒ.ఐ (వన్)

-- . -- ఒ.ఐ. (టు)

ఇలా పదహారు లైన్లున్నాయి.

చూసీచూడగానే ఎ.ఒ.గారి కాలింగ్ బెల్ పథకం అర్థమైపోయింది. చాలా సంతోషించేను.

"ఇలాటి అట్టలు అందరిదగ్గరా తలోటీ వున్నాయన్నమాట. ఏమై కరక్ట్?" అన్నాను.

"ఎస్సార్" అన్నారు అందరూ ఏక కంఠంగా "మీ ఎ.ఒ గారిక్కూడా ఒకటి తయారు చేసి ఇవ్వలేకపోయారా?" అని వేళాకోళం చేసేను. "ఇచ్చేం కదండి" అని చాలా సిన్సియర్‌గా జవాబు.

"ఐసీ - " అని ఒక్కనిమిషం ఆలోచించి, టైపిస్టుకి సంజ్ఞచేసి అతనిచ్చిన అట్ట అతనికిచ్చేశాను.

"పరమేశ్వర్రావుగారూ; మీ ఎ.ఒ.గార్ని నేను పిలుస్తున్నానని చెప్పండి. ఐవాంట్ టు కంగ్రాచులేట్ హిం ఆన్ ది స్కీమ్ ఆఫ్ దిస్ కాలింగ్ బెల్!" అన్నాను.

"అలాగే, సార్" అని వెళ్లాడతను.

బెల్ మళ్ళీ మోగింది. మూడు చిన్న ధ్వనులు ఒక పెద్ద ధ్వని. స్పష్టంగా వుంది. కాని అతి కర్ణకఠోరంగా వుంది మోత.

అందరూ బెల్‌వేపు చూశారు. నేను వాళ్ళందరి వేపూ చూశాను; ఎవరులేస్తారాని.

సుబ్రమణ్యం లేచాడు.

"నో. కూర్చోండి. ఆయనే వస్తున్నారుగా." అన్నాను.

సుబ్రమణ్యం నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నాడు.

ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు రాజారామ్ హడావుడిగా హాల్లోకొచ్చేడు. "నమస్కారం సార్!... ఏమిటి నాయూనిట్‌లోకి స్వయంగా వొచ్చేశారే! ఎంతసేపైందండి వచ్చి?"

"టెన్‌మినిట్స్, అంతే"

"ఏమయ్యా ఎవరూ చెప్పేరు కాదేం- ఈపది నిమిషాల్లో మీరు నా రూం కొచ్చేరుగా" అని డిశ్పాచ్ క్లర్క్ వైపు హెడ్ గుమస్తావైపు చూస్తూ అన్నాడు రాజారాం.

వాళ్ళిద్దరూ ఏం అనలేదు.

ఎ.ఒ. రాజారాంను అక్కడ రెండు నిమిషాలు నిలబడమని , తిన్నగా ఆయన రూంలోకెళ్ళి, కాలింగ్ బెల్ బటన్‌ని ఐదు సెకండ్లపాటు దీర్ఘంగా అదిమిట్టాను-

నేను ఎ.ఒ రూంలోంచి బైటపడే సరికి ఆయన కంగారుగా పరుగెత్తుకుంటూ వచ్చేశాడు.

"లెట్స్ గో టు మై చాంబర్స్" అని ముందు దారి తీశాను.

✣ ✣ ✣

" మీకు ఇంకో యిద్దరు స్టాఫ్ కావాలన్నారు"

"ఎస్సార్"

"మీప్రపోజల్ ఇదుగో తీసుకోండి. నేను రిటర్న్ చేస్తున్నాను"

"ఎస్సార్"

"మీ ప్రపోజల్ నేను అప్రూవు చేయడం లేదని మీరేమీ ఇదవ్వద్దు. పదిరోజులు ఆగి మళ్ళీ పంపండి."

"అలాగే సార్."

"ఈ పదిరోజుల్లో మీరు చెయ్యవలసినవి కొన్ని పన్లున్నాయి."

"చెప్పండిసార్"

"మీ శెక్షన్ ప్యూన్ చాలా కాలంనుంచి నాకు కనబడ్డంలేదు. శలవులో వున్నాడేమో అనుకున్నాను!"

"..... ..... "

"అతనికి జీతం యిస్తున్నాం. డ్యూటీమీద వుంటే అతనికి వచ్చే ఇన్సిడెంటల్స్ బిల్సు కూడా పే చేస్తున్నాం. ఏమయిపోయాడా అని ఇన్వెస్టిగేట్ చేస్తే అతను మీ డ్యూటీలో వున్నాడని తేలింది."

"నో సర్ - నేను మనవి చేసేదేమిటంటే-" అని కుర్చీలో కొంచెం ముందుకి జరిగి తలకూడా ముందుకి జాపాడు ఎ.ఒ. రాజారాం.

"మిస్టర్ రాజారాం. నేను మిమ్మల్నేం తప్పు పట్టడంలేదు. కంపెనీ ఇంటరెస్టు దృష్ట్యా మాట్లాడుతున్నాను. మీప్యూను నాకాఫీసులో కనబడకపోయే సరికి నేను వర్రీ అయ్యాను. అతనికి బాగాలేదేమో అనుకుని రిజిస్టర్స్ తెప్పించాను. అతను ఆఫీసు కొస్తున్నట్టు అటెండెన్స్‌లో

సంతకాలుంటున్నాయి. ఒంట్లో బావులేక, ఇక్కడ కూచో లేక సంతకాలెట్టేసి వెళిపోతున్నాడేమోనని అనుమానం కలిగింది. దీనిమీద ఇన్వెస్టిగేషన్ చేశాను. అతను పొద్దుట పదింటికి వస్తున్నాడు. మీది, మీ ఆఫీసు సూపరింటెండెంటుది పాస్ బుక్స్ తీసుకుని మీరు రోజూ బ్యాంక్‌లో వేస్తున్న రోజువారీ డిపాజిట్ పథకం వాయిదాలు చెల్లించి పదకొండింటికి మీ ఇళ్ళకి వెళ్తున్నాడు. ఒంటిగంటకల్లా మీ ఇద్దరి ఉత్తరాలు, మధ్యాహ్నం భోజనాలు తెస్తున్నాడు; సైకిలుకి కట్టుకుని. రెండింటికి ఆఫీసు టపాలు తీసుకుని లోకల్‌డెలివరీకని వెళ్ళి నాలుగింటికి మీ అబ్బాయిని కాన్వెంట్ దగ్గర సైకిలెక్కించుకుని అక్కణ్ణించలా ఇంటికి వెళ్ళిపోయి టపా పుస్తకంతో సహా మర్నాడు పొద్దుట పదకొండింటికి ఆఫీసుకొస్తున్నాడు -''

'ఐయామ్ సారీసార్. '' అన్నాడు రాజారాం. '' మీ అభిప్రాయం రైటు కాదేమోనని మనవి'

“ఒకవేళ రైటుకాకపోయినా దాన్ని గురించి మీరు పట్టించుకోకండి. ఆప్యూను నాకు రాసిచ్చిన స్టేట్‌మెంటు నేను బైట పెట్టడం లేదు. రేపట్నుంచి మీ శెక్షనుకి ప్యూనుగా అప్పారావుకి బదులు సింహాచలం వస్తాడు. పని సరిగ్గా జరగడానికి కొన్నాళ్ళపాటు నేను చెప్పినట్టు చేసి చూడండి. అదేంటంటే - ఒకటి: మీ శెక్షనుకిచ్చిన ప్యూన్ని అంటే సింహచలాన్ని ఆఫీసు పనిచేసేవేళల్లో ఆఫీసులోనే వుండమనండి. రెండు: మీరు క్లర్క్స్ హాలులో పెట్టించిన బెల్లు తీయించేయండి.

“మీరు శ్టాఫ్‌లో ఎఫిషెన్సీ తగ్గిపోతోందని రాసేరు. మీరు క్లర్క్స్ హాలులో పెట్టించిన బెల్లు ఎంత కఠోరంగా మోగుతోందో ఇప్పుడే మీరు తెలుసుకున్నారుగా. మీకెవర్ని పిలవాలనుంటే ఎలా బెల్ మోగిస్తారో దానికి మీరిచ్చిన సింబల్సు చూశాను. మీకు ప్రస్తుతం వున్న శ్టాఫ్ పదహారు మందీ కూడా ఏకాగితం రాస్తున్నా ఏం ఆలోచిస్తున్నా ఏక్షణాన ఆబెల్ మోగుతుందోనని ఒక కన్నూ ఒక చెవీ ఆబెల్‌కు వొప్పగించి పనిచేస్తున్నారు. వాళ్ళలో ప్రతి ఒక్కరికి ఆ బెల్‌ను ప్రత్యేక శ్రద్ధతో వినవలసిన అవసరం వుంటోంది. ప్రతి ఒక్కరు బెల్ పిలుపు తన కౌనో కాదో ఖచ్చితంగా తెలుసుకోవలసిన అవసరం వుంది కదా. బెల్లు మీది శ్రద్ధతో పనిమీద దృష్టినిల్పలేకపోతున్నారు. ఆ బెల్ చేసే కర్ణ కఠోరమైన ధ్వనితో, ఆ బెల్ మోతలోని పిలుపు ఎవరికో తెలుసుకొందికి చూపేశ్రద్ధతో వాళ్ళు పనిమీద దృష్టి నిల్పలేక ఎఫిషెన్సీపడి పోయుంటుందిగాని మరోకారణం చేత కాదని నేను తెలుసుకున్నాను. అంచేత - ''

“తమరు చెప్పినట్టు చేస్తాన్సార్” అని రాజారాం శలవు తీసుకువెళ్ళాడు.

*

*(“అనామిక” మాసపత్రిక : ఉగాది 1977)*